తెలంగాణ సాధించిన పార్టీపై అనుచిత వ్యాఖ్యలా

- బండి సంజయ్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలి
- బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

కొత్తపల్లి, సెప్టెంబర్ 10 : బీఆర్ఎస్ పార్టీపై విమర్శలు చేసిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన డివిజన్‌లోని మీ సేవ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్‌ను ఔట్ డేటెడ్ పార్టీ అని బండి సంజయ్ అనడం హాస్యాస్పదంగా ఉందని, తెలంగాణను సాధించిన పార్టీపై ఆయన అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనతోనే బండి సంజయ్ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా, ఇప్పుడు తెలంగాణ నుంచి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్నాననే విషయాన్ని మరిచిపోవద్దన్నారు. తెలంగాణ ప్రజల గుండెల్లో బీఆర్ఎస్ ఉంటుందని, తమ పార్టీ ఎప్పుడూ పదవుల కోసం పాకులాడలేదన్నారు. ప్రతి నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు 50వేలకు పైగా క్రియాశీల సభ్యత్వాలు ఉన్నాయని, బీజేపీ సభ్యత్వాల సంఖ్య ఎంతో చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ 39 సీట్లు సాధించి ప్రతిపక్ష హోదాతో ప్రజల కోసం ఉద్యమిస్తున్నదని, బీజేపీ ఎన్ని సీట్లు గెలుచుకున్నదని ప్రశ్నించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి బీఆర్ఎస్ అంటే భయం పట్టిందని, బీఆర్ఎస్ అధికారంలో ఉన్నట్లే పార్టీపై, తమ నాయకులపై విమర్శలు చేస్తున్నారన్నారు. రాబోయే అన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులు భారీ సంఖ్యలో విజయం సాధిస్తారని, ఆ తర్వాత బీజేపీ, కాంగ్రెస్ నాయకులకు గ్రామాలు, పట్టణాల్లో నో ఎంట్రీ బోర్డులో దర్శనమిస్తాయని పేర్కొన్నారు. తెలంగాణకు కేంద్ర బడ్జెట్‌లో నిధులు తీసుకురాని బండి సంజయ్, ఎన్నికల హామీలను విస్మరించిన సీఎం రేవంత్‌రెడ్డి బేషరతుగా ప్రజలకు క్షమాపణలు చెప్పాలని, లేదంటే పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు షౌకత్, నవాజ్, బి. సాయికృష్ణ, వాజీద్, అరె రవి, చేతి చంద్రశేఖర్, జెల్లోని శ్రీనివాస్, ఇర్ఫాన్, సత్తినేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'రాజేందర్ రావు తక్షణమే క్షమాపణ చెప్పాలి'

విద్యానగర్, సెప్టెంబర్ 10 : హిందూ దేవుళ్లను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నేత వెలిచాల రాజేందర్ రావు తక్షణమే హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని, లేకుంటే ఆయనకు కరీంనగర్‌లో అడుగడుగున హిందూ సమాజం బుద్ధి చెప్పాల్సి వస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిల్లపు రమేశ్ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. కరీంనగర్ పేరు మార్చాలన్నప్పుడే జిల్లా ప్రజలకు ఆయన తెలివి తేటలెల్లమైందని విమర్శించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి కోసం లేదా ఎమ్మెల్సీ పదవీకాంక్షతో రాజేందర్‌రావు ఊబలాటపడుతున్నారని స్పష్టంగా అర్థం అవుతున్నదని దుయ్యబట్టారు. ప్రతిపక్షాలపై విమర్శలు చేస్తే పదవులు రావని గ్రహించాలని చురకలంటించారు.

దవాఖానల్లో మెరుగైన వైద్యసేవలందిస్తాం: డీసీహెచ్ఎస్

విద్యానగర్, సెప్టెంబర్ 10: తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో నడుస్తున్న దవాఖానల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని డీసీహెచ్ఎస్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం ప్రభుత్వ ప్రధాన దవాఖానలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హుజూరాబాద్, జమ్మికుంట దవాఖానల్లో త్వరలో అన్ని రకాల సిజేరియన్ ప్రసవాలు చేపట్టేందుకు సిబ్బందిని నియమించి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. చొప్పదండిలో నూతన భవన నిర్మాణం పూర్తికాగా, వంద పడకల దవాఖానలో ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేయడంతోపాటు అన్ని రకాల వైద్య సేవలు అందిస్తామన్నారు.

వీర వనిత ఐలమ్మకు ఘన నివాళి

ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

గంగాధర: మధురానగర్‌లో ఐలమ్మకు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

తెలంగాణ చౌక్/సైదాపూర్/ చిగురుమామిడి/ఇల్లందకుంట/రామడుగు/శంకరపట్నం/తిమ్మాపూర్ రూరల్/గంగాధర/హుజూరాబాద్ టౌన్, సెప్టెంబర్ 10 : తెలంగాణ వీర వనిత చిట్యాల ఐలమ్మ వర్ధంతిని రజక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నగరంలో సీపీఎం, బీసీ సంఘాల జేఏసీ, సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక మల్టిప్లెక్స్ సమీపంలోని చిట్యాల ఐలమ్మ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, గుడికందుల సత్యం, జి. బీమాసాహెబ్, జిల్లా కమిటీ సభ్యులు యు.శ్రీనివాస్, శీలం అశోక్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెశెపెద్ది శ్రీధర్ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్‌కుమార్, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, పైడిపెల్లి రాజు, కిన్నెర మల్లవ్వ, నలువాల సదానందం, నాయకులు తిప్పారపు సత్యనారాయణాచారి, నల్లగొండ శ్రీనివాస్ పాల్గొన్నారు. సైదాపూర్ మండలకేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య, నాయకులు శ్రీనివాస్, సమ్మయ్య, సంతోష్, సమ్మయ్య, రాజకొమురయ్య, రాజు, కృష్ణమూర్తి, శంకరయ్య, అరవింద్, సుధాకర్, రాజు తదితరులు పాల్గొన్నారు. చిగురుమామిడి మండలం రేకొండ గ్రామంలో ఆదర్శ రజక సంఘం అధ్యక్షుడు దుడ్డేల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గోదారి అజయ్ కుమార్, కారోబార్ పీరల్ల రాజ్ కుమార్, రజక సంఘం నాయకులు దుడ్డేల అనిల్ కుమార్, దొడ్డెల సదానందం, రాచర్ల రంగయ్య, కొత్తపల్లి పరశురాములు, నాంపల్లి శ్రీధర్, సమ్మయ్య, శ్రీనివాస్, రాజేందర్, యాదగిరి, రాజు, కనకయ్య, సంజీవ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు. ఇల్లందకుంట మండల కేంద్రంలో ఐలమ్మ విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కంకణాల శ్రీలతా సురేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ పెద్దికుమార్, రజకసంఘం మండలాధ్యక్షుడు రావుల ఎల్లయ్య, గ్రామాధ్యక్షుడు ఎల్లయ్య, నాయకులు సంపత్, రాజబాబు, పరశురాం శ్రీనివాస్, వేణు, రాజయ్య పాల్గొన్నారు. రామడుగు మండలం గోపాల్‌రావుపేటలో శివగంగ మడేల్ రజకసంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పైండ్ల హన్మంతు, ఉపాధ్యక్షుడు లింగంపెల్లి అంజయ్య, ప్రధాన కార్యదర్శి పైండ్ల తిరుపతి, కోశాధికారి పున్న కనకయ్య, కార్యదర్శి పైండ్ల చిన్న హన్మంతు, సభ్యులు పైండ్ల శ్రీనివాస్, మధు, నర్సయ్య, కొమురయ్య, మల్లేశం, సందీప్ తదితరులు పాల్గొన్నారు. శంకరపట్నం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద రజక సంఘం ఆధ్వర్యంలో వీరనారి ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. నాయకులు ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రయాణికులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీవో ప్రభాకర్, సూపరింటెండెంట్ రాఘవేందర్‌రెడ్డి, రజక సంఘం మండలాధ్యక్షుడు తాడిచర్ల తిరుపతి, నియోజకవర్గ అధ్యక్షుడు నాంపల్లి శంకరయ్య, సంఘం ప్రతినిధులు కల్లెపల్లి క్రాంతికుమార్, రాసమల్ల శ్రీనివాస్, కల్లెపల్లి కిరణ్, దండు కొమురయ్య, కల్లెపల్లి రాజయ్య, వెంకటేశ్, సదానందం, సంపత్, సతీశ్, సాయిలు, వెంకటేశం, సాయికుమార్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు. తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామంలో ఐలమ్మ విగ్రహానికి ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. చాకలి ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకుని ఆమె ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. గంగాధర మండలం మధురానగర్‌లో మండల రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం నిర్వహించగా, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పాల్గొని ఆమెకు నివాళులర్పించారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు రాగల్ల రమేశ్, రాజేశం, మల్లయ్య, అంజయ్య, మల్లేశం, సాగర్, రాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు. తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ అనుపమ ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ వినయ్, ఆర్ఐ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. హుజూరాబాద్ పట్టణంలోని ఏరియా దవాఖాన ఎదురుగా ఉన్న ఐలమ్మ విగ్రహానికి హుజూరాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ గందె రాధికాశ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే గ్రంథాలయంలో ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండపాక శ్రీనివాస్, రజక యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నిమ్మటూరి సాయికృష్ణ, కేదాసి శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, కౌన్సిలర్లు తోట రాజేంద్రప్రసాద్, తాళ్లపెల్లి శ్రీనివాస్, ఇమ్రాన్, నాయకులు నల్ల సుమన్, కొండ్ర నరేశ్, కొలిపాక శంకర్, తాటిపాముల రాము, ఎర్ర శ్రీధర్, నాగరాజు, ఎర్ర రాజ్‌కుమార్, ముక్కపల్లి రమేశ్, అశోక్ పాల్గొన్నారు.

పోరాటాలకు స్ఫూర్తి ఐలమ్మ: కలెక్టర్

కలెక్టరేట్, సెప్టెంబర్ 10 : తెలంగాణ వీర వనిత చిట్యాల ఐలమ్మ పోరాటాలకు స్ఫూర్తి అని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. ఐలమ్మ 39వ వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, ప్రజాపోరాటాలకు ఐలమ్మ స్ఫూర్తి దాయకమని, ఆమెను నేటి మహిళలు ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరముందన్నారు. ఐలమ్మ చేసిన భూపోరాటంతో ఎందరో నిరుపేదలకు భూముల పంపకం జరిగిందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ప్రపుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, శిక్షణ కలెక్టర్ అజయ్‌యాదవ్, ఆర్డీవో కె.మహేశ్వర్, జిల్లా బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ అనిల్ ప్రకాశ్, పలువురు బీసీ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలకు కాంగ్రెస్ ఒరగబెట్టిందేమీ లేదు

కలెక్టరేట్, సెప్టెంబర్ 10: రాష్ట్రంలోని మైనార్టీలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఒరగబెట్టిందేమీ లేదని మైనార్టీ సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ మహ్మద్ సిరాజ్ విమర్శించారు. మంగళవారం నగరంలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో మైనార్టీలకు ఇచ్చిన హామీలు కూడా అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. మౌజమ్, ఇమామ్‌లకు వేతనాలు పంపిణీ చేయడంలో కూడా నిర్లక్ష్యం కనబరుస్తున్నదని మండిపడ్డారు. మైనార్టీ రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వెనుక ఆంతర్యమేంటో మైనార్టీలు గమనిస్తున్నారని, రాబోయే కాలంలో తగిన బుద్ధి చెప్పేందుకు ఇప్పటి నుంచే సిద్ధమవుతున్నారని హెచ్చరించారు. సమావేశంలో మైనార్టీ నాయకులు మహ్మద్ షబ్బీర్, తెలంగాణ ఉద్యోగుల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ రాజ్‌మహ్మద్, యూసుఫ్, రజాక్, ఇమ్రాన్‌ఖాన్‌తో పాటు వందమందికి పైగా ముస్లింలు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయ సమస్యలు పరిష్కరించాలి

ఎస్‌యూ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు, ఏబీవీపీ నాయకులు

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 10 : శాతవాహన విశ్వవిద్యాలయంలో పర్మినెంట్ వీసీని నియమించడంతో పాటు, యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేశ్, యూనివర్సిటీ నాయకుడు, రాష్ట్ర కార్య సమితి సభ్యుడు జెల్లపల్లి అంజన్న డిమాండ్ చేశారు. ఏబీవీపీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శాతవాహన యూనివర్సిటీ ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు యూనివర్సిటీలోకి వెళ్లే ప్రయత్నం చేయగా, వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో వారి మధ్య తోపులాట జరిగింది. పలువురు విద్యార్థులపై పోలీసులు లాఠీలు ఝుళిపించి, అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో విభాగ్ కన్వీనర్ అజయ్, రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ రంజిత్, జిల్లా కన్వీనర్లు పూసాల విష్ణు, మాడవేణి సునీల్, బండి రాజశేఖర్, సామలపల్లి ప్రశాంత్, నగర కార్యదర్శులు భామండ్ల నందు, రాజు, సిద్ధార్థ, వరుణ్, హాస్టల్ కన్వీనర్ రాసూరి ప్రవీణ్, ఓమేశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మధు, శ్రీపతి సాయి తేజ, అజయ్, నాయకులు శ్రీ వర్ధన్, ప్రదీప్, విఘ్నేశ్, అనిల్, విష్ణు, ప్రశాంత్ హరి ఓం, మారుతి, మెరుగు సిద్ధార్థ, మనీషా, అలేఖ్య, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రీడోత్సవాలు

వీణవంక, సెప్టెంబర్ 10: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నేటి నుంచి పాఠశాలల క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి కె.శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ టోర్నమెంట్ సెలెక్షన్స్, గురువారం బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ , అథ్లెటిక్స్ సెలెక్షన్స్ ఉంటాయని తెలిపారు. క్రీడల్లో పాల్గొనే పాఠశాలల క్రీడాకారులు బోనఫైడ్ ధ్రువీకరణ పత్రం అందజేయాలని, 1 జనవరి 2011 తర్వాత జన్మించిన వారు పద్నాలుగేళ్లలోపు విభాగంలో , 1 జనవరి 2008 తర్వాత జన్మించిన వారు పదిహేడేళ్లలోపు విభాగంలో పాల్గొనాలని సూచించారు. ఆసక్తి గల వారు పీడీ పోతరవేన శ్రీనివాస్ (934612025)ను సంప్రదించాలని తెలిపారు.

పుట్టిన రోజున.. దుస్తుల వితరణ

క్రీడా దుస్తులు అందుకున్న విద్యార్థులతో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రెడ్డవేని మధు

కొత్తపల్లి, సెప్టెంబర్ 10 : కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రెడ్డవేణి మధు తన కూతురు రితన్య 10వ పుట్టిన రోజును పురస్కరించుకొని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంగళవారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. మండలంలోని ఆసీఫ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో 5 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు రూ.60వేల విలువైన క్రీడా దుస్తులను సమకూర్చారు. పాఠశాలలో చదువుతున్న సుమారు వంద విద్యార్థులందరికీ టీ షర్ట్‌తో పాటు ప్యాంట్‌ను అందజేశారు. విద్యార్థులకు క్రీడా దుస్తులు అందించిన మధును ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. కార్యక్రమంలో పిల్లి మహేశ్, కడారి శ్రీనివాస్, సాబీర్, దావ కమల మనోహర్, పెంచాల అంజి, పెరిక శ్రీను, పెరిక లక్ష్మారావు, పెంచాల తిరుపతి, బూస కరుణాకర్, కటుకం కరుణాకర్, హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు శర్మ, సంతోష్, నాగమణి, వసంత తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వానికి అధికార యంత్రాంగంపై పట్టు లేదు'

తెలంగాణచౌక్, సెప్టెంబర్ 10: రాష్ట్ర ప్రభుత్వానికి అధికార యంత్రాంగంపై ఏమాత్రం కూడా పట్టు లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి విమర్శించారు. జిల్లాలో చోటు చేసుకుంటున్న ఘటనలే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. మంగళవారం సీపీఐ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలు ఈ నెల 11 నుంచి 17 వరకు జిల్లాలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల జిల్లాలో పంటలకు తీవ్రనష్టం జరిగిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దీనిని జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్, పైడిపెల్లి రాజు, బామండ్లపెల్లి యుగంధర్, బోనగిరి మహేందర్ పాల్గొన్నారు.

అల్ఫోర్స్‌లో వినాయకుడికి ప్రత్యేక పూజలు

గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ పాఠశాలలో గణనాథుడికి ప్రత్యేక పూజలు చేస్తున్న చైర్మన్ నరేందర్‌రెడ్డి

రామడుగు, సెప్టెంబర్10 : గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ విద్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి విద్యా సంస్థల చైర్మన్ డా. వీ నరేందర్‌రెడ్డి మంగళవారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల్లో భక్తి భావాన్ని పెంపొందించేందుకు ప్రతి సంవత్సరం అల్ఫోర్స్ విద్యాలయాల్లో గణేశ్ నవరాత్రోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇక్కడ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

వినాయక మండపాల వద్ద జాగ్రత్తలు పాటించాలి

చొప్పదండి, సెప్టెంబర్ 10: వినాయక మండపాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా, ప్రమాదాలు జరుగకుండా నిర్వాహకులు తగు జాగ్రత్తలు పాటించాలని సీఐ ప్రకాశ్‌గౌడ్ సూచించారు. మంగళవారం చొప్పదండి పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని వినాయక మండపాల నిర్వాహకులతో ఎస్ఐ అనూష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సీఐ ప్రకాశ్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉత్సవాల నిర్వహణలో, అలాగే కాలువలు, చెరువుల వద్ద విగ్రహాలను నిమజ్జనం చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వినాయక మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశం

చొప్పదండి, సెప్టెంబర్ 10: తెలంగాణ మత్స్యకార్మిక మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన పిట్టల వెంకటేశం, ఉపాధ్యక్షుడిగా నూనె శేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేల్లెల బాలకృష్ణ ఆధ్వర్యంలో ముకుంద లాల్ మిశ్ర భవన్‌లో మంగళవారం ఎన్నికలు నిర్వహించారు. కార్యక్రమంలో పిట్టల సంపత్, గణవేణి లచ్చయ్య, తామర మల్లేశం, నరసయ్య, బినవేని మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దీపారాధన

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 10 : జిల్లా కేంద్రంలోని సంతోష్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ విఘ్నేశ్వర నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రంగు శ్రీనివాస్ గౌడ్ వసంత లక్ష్మి ఆధ్వర్యంలో నాలుగో రోజు దీపారాధన కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యకర్యమంలో కాలనీ మహిళలు శైలజ, రమ, శోభ, సంధ్య, లత, హైమావతి, కనకతార, మమత, భూలక్ష్మి, విజయ, జయశ్రీ, జయ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మానకొండూర్, సెప్టెంబర్ 10: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 74 మంది లబ్ధిదారులకు వైద్య చికిత్స కోసం ప్రభుత్వం నుంచి సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు కాగా, స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వరలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ మర్రి ఓదెలు, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నందగిరి రవి, నాయకులు పాల్గొన్నారు.

ఎస్సారార్ స్టాఫ్ క్లబ్ సెక్రటరీగా డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 10: శ్రీ రాజరాజేశ్వర ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల స్టాఫ్ క్లబ్ సెక్రటరీగా కామర్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లారం శ్రీనివాస్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యాంసాని సత్యనారాయణ పేర్కొన్నారు. కళాశాల ఆవరణలో నిర్వహించిన ఎన్నికల్లో ఎలక్షన్ ఆఫీసర్‌గా కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఉమారాణి వ్యవహరించగా, ఎలక్షన్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ రమేశ్ బాబు, డాక్టర్ వీ శ్రీనివాస్ ఎన్నికలు నిర్వహించారని వివరించారు. కాగా స్టాఫ్ క్లబ్ సెక్రటరీగా ఎన్నికైన డాక్టర్ మల్లారం శ్రీనివాస్ రెడ్డికి ప్రిన్సిపాల్‌తో పాటు కళాశాల బోధన సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

రాంనగర్, సెప్టెంబర్ 10: బొమ్మకల్‌కు చెందిన ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్మకల్ హుస్సేనిపురకు చెందిన ఎండీ అక్బర్ (50)కు మున్నాబి అనే మహిళతో వివాహం కాగా, ముగ్గురు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నారు. కొద్ది రోజులుగా ఇంట్లో గొడవలు కావడంతో అక్బర్ భార్య తల్లి గారింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో అక్బర్ మరో మహిళను వివాహం చేసుకున్నాడు. మంగళవారం ఉదయం కొడుకును బస్సు ఎక్కించి ఇంటికి వెళ్లిన అక్బర్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోగా, ఇంటి పక్కనున్న ఎండీ ఇర్ఫాన్, ఫారూక్ గమనించి కిందికి దింపారు. అప్పటికే అక్బర్ మరణించడంతో సమాచారం అందుకున్న భార్య మున్నాబి అక్కడికి చేరుకుని అనుమానం వ్యక్తం చేశారు. తన భర్త అక్బర్ మృతిపై అనుమానాలున్నాయని, విచారణ జరుపాలని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

కరీంనగర్ రూరల్, సెప్టెంబర్ 10: నగునూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆర్‌బీఐ 90వ వార్షికోత్సవం సందర్భంగా ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. వార్షికోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. విద్యార్థినులు ఆర్‌బీఐ దేశవ్యాప్తంగా నిర్వహించబోయే క్విజ్‌లో పాల్గొని బహుమతులు గెలుపొందాలని బ్యాంకు అధికారులు ఆనంద్ కుమార్ తదితరులు సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. మాలతి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సమత, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ డి. శ్రీహరి, ఆఫీస్ సూపరింటెండెంట్ టి. సురేశ్‌కుమార్ అ